క్లుప్తంగా

విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ



పాదరక్షలు అందుకున్న విద్యార్థులు

విజయపురం: శ్రీహరిపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, దాత కిన్నెర దినేష్ గురువారం పాఠశాల విద్యార్థులకు పాదరక్షలు అందజేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రతి విద్యార్థి చెప్పులు ధరించాలని ప్రధానోపాధ్యాయుడు జ్ఞానప్రసాద్ తెలిపారు. విద్యార్థుల అవసరాలను తెలుసుకొని సాయం చేసిన కిన్నెర దినేష్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు విజయచంద్రిక, సునీత, రాధాకుమారి, విజయకుమార్, గోపి, విజయవర్మ, వెంకమరాజు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

చిన్నారులకు కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ దామోదరం

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం భవిత కేంద్రంలో ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లలకు ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో మంజూరు చేసిన కిట్లను ఎంఈఓ–2 దామోదరం పంపిణీ చేశారు. గురువారం భవిత కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అందరూ పిల్లలకు వీల్ చైర్, హియరింగ్ కిట్లు, రోలేటర్, సీపీ చైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. బుద్ధిమాంద్యం గల పిల్లల అభివృద్ధికి అనేక సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సిద్దయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, భవిత కేంద్రం టీచర్ శ్యామల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుస్థితిలో రహదారి



గులకరాళ్లు తేలిన వసంతనగర్–ఓబీఆర్ కండ్రిగ రోడ్డు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం ఓబీఆర్ కండ్రిగ నుంచి వసంతనగర్ వెళ్లే అంతర్గత రోడ్డు అధ్వానంగా ఉంది. అడుగడుగునా గుంతలు, గులకరాళ్లు తేలి దర్శనమిస్తోంది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. రోడ్డు బాగా లేకపోవడంతో తడుకు ఆర్ఎస్ మీదుగా వడమాలపేట వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

నిలువ నీడ లేదు

వడమాలపేట(విజయపురం): వడమాలపేట నుంచి వివిధ పనుల నిమిత్తం తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు నిలువ నీడ లేక అవస్థలు పడుతున్నారు. అసలే వేసవి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం 10 దాటితే అడుగు బయట పెట్టడానికి భయంగా ఉంది. ఇలాంటి పరిస్థితిలో వడమాలపేట ఆటోస్టాండ్ వద్ద ప్రయాణికులకు నిలువ నీడలేక అవస్థలు పడుతున్నారు. నీడ కోసం దుకాణాల వద్ద నిలుచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు అంటున్నారు. పాలకులు స్పందించి ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

సైన్స్ పరికరం వితరణ

విజయపురం: విజయపురం మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలకు ఐఎఫ్‌టీఆర్ సంస్థ సైన్స్ పరికరాలను అందజేసింది. గురువారం చెన్నై ఐఎఫ్‌టీఆర్ సంస్థ చైర్మన్ కృష్ణంరాజు ఎమ్మెల్యే చేతుల మీదుగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భానుప్రకాష్ జంబాడ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. డాక్టర్ రవిరాజు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్వారీ పేలుడులో బాలుడికి గాయాలు

పుత్తూరు: ఓ గ్రానైట్ క్వారీలో జరిపిన పేలుడు మూడేళ్ల బాలుడిని ఆసుపత్రి పాల్జేసింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పుత్తూరు మున్సిపాలిటీ 27వ వార్డులోని ఈశ్వరాపురం గ్రామానికి చెందిన కృష్ణమరాజు మామిడి తోటలో సూర్య చెంచులక్ష్మీ, రమేష్ దంపతులు కాపలా ఉంటున్నారు. వీరికి దినేష్ అనే మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈశ్వరాపురం గ్రామానికి సమీపంలో ఉన్న గ్రానైట్ క్వారీలో బుధవారం సాయంత్రం ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టకనే బ్లాస్టింగ్ చేశారు. పేలుడు ధాటికి ఎగిరిబడ్డ బండరాయి చెక్కముక్కల్లో ఒకటి దినేష్ తలకు బలంగా తాకడంతో తీవ్ర గాయమైంది. గాయపడ్డ దినేష్‌ను పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి స్విమ్స్ ఆసపత్రికి తరలించారు. దినేష్ తల్లి సూర్యచెంచులక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రానైట్ క్వారీ మేనేజర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ

పన్నూరులో నువ్వుల పంట



నువ్వులు.. నూనె గింజల పంటల్లో ప్రధానమైనది. వేసవి సాగుకు అనుకూలమైనది. ఫిబ్రవరి మొదటి వారంలో విత్తుకొని, అతితక్కువ సమయంలోనే అధిక లాభాన్ని పొందవచ్చు. వర్షాధారంగా సాగు చేసేకన్నా, వేసవిలో ఆరుతడి పంటగా వేయడంతో విత్తన నాణ్యతతోపాటు దిగుబడి కూడా పెరుగుతుంది. చీడపీడల సమస్యా తగ్గుతుంది. అందుకే, నువ్వులను సాగు చేస్తే, అధిక ఆదాయం పొందే అవకాశం ఉంది.

– విజయపురం

- నువ్వుల సాగుతో లాభాల బాట
- తక్కువ పెట్టుబడి అధిక లాభం
- వేసవిలో ఆరుతడి పంటగా వేయడం మంచిది

నువ్వుల సాగుతో తక్కువ పెట్టుబడి అధిక దిగుబడి సాధించవచ్చు. 80–85 రోజుల్లో పంట చేతికందడంతో రైతులు నువ్వుల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే మండలంలో 150కి పైగా ఎకరాల్లో రైతులు నువ్వులు సాగు చేసి ఉన్నారు. ప్రతి ఏటా ఒక పన్నూరులోనే 75 ఎకరాలకు పైగా రైతులు నువ్వులు సాగు చేసి అధిక దిగుబడి పొందుతున్నారు.

నేల ఎంపిక.. తయారీ

మురుగు నీరు నిల్వ ఉండని నల్లరేగడి, తేలికపాటి నేలలు నువ్వుల సాగుకు అనుకూలం. అయితే, నీరు నిలుస్తూ, ఆమ్ల, క్షార గుణాలుండే నేలల్లో ఈ పంట వేయకపోవడమే మంచిది. అనుకూలమైన నేలల్లో దుక్కిని బాగా చదును చేసి, పొడి దుక్కి ఉండేలా చేసుకోవాలి. దీనివల్ల విత్తనాలు బాగా మొలకెత్తి, మొలకశాతం పెరుగుతుంది.

విత్తన రకాలు

చిత్తూరు జిల్లా తూర్పు మండలంలో ప్రధానంగా ఎలమంచిలి (వైఎల్ఎం) విత్తనం రకం మంచిది. రకాన్ని బట్టి ఎకరానికి రెండు కిలోల విత్తనాలు అవసరమవుతాయి. వీటికి 7–10 కిలోల సన్నని పొడి ఇసుకను కలుపుకొని, పొలంలో సమంగా చల్లుకోవాలి. వరుసల మధ్య దూరం 30 సెం.మీ. ఉండేలా చూసుకోవాలి.

విత్తనశుద్ధి

కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా మ్యాంకోజెబ్, లేదా 2 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ 70 డబ్ల్యూఎస్ కలుపుకొని శుద్ధి చేసుకోవాలి. మొదటగా తెగుళ్ల మందుతో, ఆ తర్వాత పురుగు మందుతో విత్తనశుద్ధి చేసుకోవడం మంచిది.

నీటి యాజమాన్యం

విత్తనాలు వేసిన వెంటనే నీటి తడిని తప్పకుండా ఇవ్వాలి. లేకుంటే, మొలక శాతంపై ప్రభావం పడుతుంది. పూత దశ, కాయ వృద్ధితోపాటు గింజ కట్టే దశల్లోనూ నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది.

కలుపు నివారణ

నువ్వుల సాగులో కలుపు నివారణ తప్పనిసరి. విత్తనాలు వేసిన 48 గంటల్లోపు లీటర్ నీటిలో 5 మి.లీ. అలాక్లోర్ 50% లేదా 67 మి.లీ. పెండిమిథాలిన్30% కలుపుకొని పిచికారీ చేయాలి. ఇందుకోసం ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణం అవసరం పడుతుంది. 20 రోజుల తర్వాత అదనపు మొక్కలను తొలగించి, చేనును పలుచన చేయాలి. మొక్కలు ఒత్తుగా ఉన్నట్లయితే కొమ్మలు, ఆకులు మాత్రమే ఏర్పడి, పూత, కాయ ఎక్కువగా రాదు. విత్తనాలు వేసిన 30 రోజుల వరకూ చేనులో ఎలాంటి కలుపు లేకుండా చూసుకోవాలి.

విత్తిన తర్వాత 35–40 రోజుల నుంచి 65–70 రోజుల వరకూ ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

సస్యరక్షణ

వేసవిలో చీడపీడల సమస్య తక్కువే అయినా, కొన్నిరకాల చీడలు ఆశించే అవకాశం ఉంది. అందుకే సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపడితే, అధిక దిగుబడులు పొందవచ్చు.

ఎరువుల యాజమాన్యం

నువ్వులు విత్తడానికి ముందే ఆఖరి దుక్కిలో ఒక ఎకరానికి 4 టన్నుల చొప్పున బాగా చివికిన పశువుల ఎరువు లేదా, ఒక టన్ను వర్మి కంపోస్ట్ వేసుకొని, కలియ దున్నుకోవాలి. దుక్కిలో ఎకరానికి 12 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం, పొటాష్ ఇచ్చే ఎరువులు వేసుకోవాలి. భాస్వరాన్ని సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేసుకుంటే, గింజ నాణ్యతతోపాటు నూనె శాతం కూడా పెరుగుతుంది. 30 రోజులకు మొదటి కలుపు తర్వాత నీటి తడి పెట్టుకొని, ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలుపుకొని, మొక్కల మొదళ్లలో వేయాలి.

విశిష్ట గుర్తింపు సంఖ్యతోనే పథకాలు

విజయపురం: విశిష్ట గుర్తింపు సంఖ్యతో కూడిన డిజిటల్ గుర్తింపు కార్డు ఉంటేనే రైతులకు పథకాలు లభిస్తాయని ఏఓ రజనికుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కలిసి రాష్ట్రంలో ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (కార్డు) ఇవ్వాలని రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 5700 మంది రైతులు ఉండగా, అందులో 3400 మంది డిజిటల్ గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకున్నట్లు ఆమె తెలిపారు. మిగలిన రైతులు త్వరలో నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు ఈ నెలాఖరులోపు స్థానిక ఆర్ఎస్‌కే కేంద్రంలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా కుంభాభిషేక వేడుకలు



హోమపూజలు నిర్వహిస్తున్న పురోహితులు

నగరి: మండలంలోని రాజుల కండ్రిగ గ్రామంలోని రామాలయ కుంభాభిషేక వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ప్రత్యేక హోమ పూజలు, వేదపారాయణం, గోపూజ, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. కలశ పూజల అనంతరం కుంభ కలశ అభిషేకం చేశారు. అభిషేక జలం కోసం జనం పోటీపడి ఆలయం చుట్టూ బారులు తీరారు. మహాభిషేకం అనంతరం భక్తులు మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం చేశారు

బాధిత కుటుంబాలకు పరామర్శ



సంపూర్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



రంగారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని గుట్టకింద దళితవాడకు చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు సురేష్ తల్లి సంపూర్ణమ్మ(55) అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ గ్రామానికి వెళ్లి సంపూర్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించారు. రాస్‌పల్లి గ్రామానికి చెందిన నరసింహారెడ్డి మోకాలికి శస్త్రచికిత్స చేసుకున్నట్లు సమాచారం అందడంతో వారి గ్రామానికి వెళ్లి వారిని పరామర్శించారు. అలాగే పూణేపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు బర్కత్ అలీ, ఎస్.హుసేన్ అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కూడా పరామర్శించారు. వారి వెంట మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, జిల్లా కో–ఆప్షన్ మెంబర్ ఆమీన్‌బాషా, జిల్లా కార్యవర్గ సభ్యుడు దూదిమోహన్, నియోకవర్గం మాజీ మహిళా అధ్యక్షురాలు యశోదరెడ్డి, నవీన్‌కుమార్ రెడ్డి, లక్ష్మీపతి, కృష్ణారెడ్డి, జయచంద్రారెడ్డి, ఉమాపతి తదితరులు ఉన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని కసవనూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్ఎం రంగారెడ్డిని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. రంగారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స చేసుకుని తిరుపతిలోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. గురువారం తిరుపతిలో పర్యటించిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆయన నివాసానికి వెళ్లి రంగారెడ్డిని పరామర్శించి, ఆరోగ్యం, యోగక్షేమాలపై వాకబు చేశారు.

బార్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న న్యాయమూర్తి

నగరి: ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది కె..వేలాయుధం, ఉపాధ్యక్షుడిగా ఎం.నాగరాజు, కార్యదర్శిగా ఎస్.జాన్ జోష్, సహాయ కార్యదర్శిగా కె.తిరుమల, కోశాధికారిగా ఎం.అరుణ్‌ను న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను జడ్జి విష్ణువర్మ అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పాల వ్యాన్ బోల్తా

శ్రీరంగరాజపురం: ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి పాల వ్యాన్ బోల్తా పడిన సంఘటన మండలంలోని చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి సంఘం డెయిరీకి పాలతో వస్తున్న వ్యాన్ క్షీరసముద్రం బీసీ కాలనీ వద్ద ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై బోల్తా కొట్టింది. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. దాదాపు 1500 లీటర్లు నేలపాలయ్యాయి.

వైభవంగా మహా కుంభాభిషేకం

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం ఎస్వీపురం పంచాయతీ బేరివాని కండ్రిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో కుంభాభిషేకం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులు జరిగిన కుంభాభిషేకం మహోత్సవం గురువారంతో ముగిసింది. మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

మాజీ మంత్రి రోజాకు ఘన స్వాగతం

శ్రీసిద్ధి వినాయక స్వామివారి ఆలయ కుంభాభిషేకం మహోత్సవం వేడుకలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శన అనంతరం దుశ్శాలువాలు, పూలమాల, ప్రసాదాలతో ఆలయ వేద పండితులు సత్కరించారు. వైస్ ఎంపీపీ ఉపేంద్ర నివాసంలో గజమాలతో సత్కరించారు. ఆమె వెంట మాజీ జెడ్పీటీసీ సురేష్‌రాజు, మధు, వాసు, రవికుమార్, దొరస్వామి, రాజేంద్రయ్య, వైస్ ఎంపీపీ ఉపేంద్ర, లోకేష్‌రెడ్డి, నందయ్య, భారత్, చంద్రారెడ్డి, కమలమ్మ, నిరంజన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గిరీష్‌వర్మ ఉన్నారు.



మాజీ మంత్రి ఆర్కే రోజాను సత్కరిస్తున్న వేదపండితులు

ముమ్మరంగా చెత్త సేకరణ

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం, కొమరగుంట, వెదురుకుప్పం, పాతగుంట, నల్లవెంగనపల్లె పంచాయతీల్లో ఇన్‌చార్జి ఎంపీడీఓ పురుషోత్తం ఆధ్వర్యంలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ పురుషోత్తం మాట్లాడుతూ 5 పంచాయతీల్లో ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని ఆవాసాల నుంచి విధిగా చెత్తను సేకరించాలని సూచించారు. ఐవీఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. కరపత్రాలు, ప్రసార మాధ్యమాలు, బ్యానర్లు, మైక్‌ల ద్వారా ప్రజలను చైతన్య పరచాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంపై గ్రామ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు సూచనలు, సలహాలు అందజేశారు.



చెత్తను సేకరిస్తున్న అధికారులు

నీటి లభ్యతపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ

నగరి: అవసరాలకు తగ్గ నీటి లభ్యతపై గ్రామీణ నీటి సరఫరా సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శ్రీహరి అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో నగరి, నిండ్ర, విజయపురం ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండల రిసోర్స్ కోఆర్డినేటర్, బోర్ మెకానిక్‌లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగంలో వివిధ పథకాల్లో మంజూరైన పనుల పురోగతిపై ఆరాతీశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తమ సంబంధిత గ్రామాల్లో ఉన్న అన్ని నీటి వనరులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామ సచివాలయాల వద్ద కట్టాల్సిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఐహెచ్‌హెచ్ఎల్ఎస్ పథకంలో గ్రామాల్లో ఇళ్లకు మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు ఇన్–లైన్ క్లోరినేషన్ పరికరాలను అమర్చాలని సూచించారు. ట్యాంకులను తరచూ శుభ్రం చేయాలన్నారు. వాటి పరిసరాలను మురుగు నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఎఫ్‌టీకే కిట్లను సిద్ధంగా ఉంచుకొని రెగ్యులర్‌గా నీటి పరీక్ష చేసి సంబంధిత ఫలితాలను రికార్డ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఈలు బి.హరిప్రసాద్, టి.శివరామకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి ఉత్పత్తుల దుకాణాన్ని ప్రారంభిస్తున్న మేనేజర్ వాసు

గంగాధరనెల్లూరు: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలందరూ ఆహారంగా తీసుకోవాలని, దీని ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. గంగాధరనెల్లూరు మండలంలో ఎస్‌పీఎం షాప్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, కషాయాలు అమ్మే షాపులో లభించే కూరగాయలు తీసుకుని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వెలుగు ఏపీఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ గ్రామాల నుంచి వచ్చే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శిరీషమూర్తి, ఎస్‌పీఎం సిబ్బంది ప్రతాప్, ధనలక్ష్మీ, హేమవతి, రేవతి, భాస్కర్ రెడ్డి, గణపతి, జయరామన్, కళావతి, రామేశ్వరి, ప్రేమ, భానుమతి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీకరకంఠేశ్వర స్వామి

నగరి: శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో గురువారం ధ్వజారోహణంతో పంగునోత్తర తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం హోమపూజలు చేసి మూలవర్లకు అభిషేకం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. సాయంత్రం సూర్యప్రభ వాహనంపై శ్రీకామాక్షి సమేత కరంఠేశ్వర స్వామి ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకొని కర్పూర హారతులు అందుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాలు అందించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తాగునీరు, పారిశుధ్యంపై అశ్రద్ధ వద్దు

- తాగునీరు కనీసం 2 రోజులకు ఓసారైనా ఇవ్వండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటేశ్వర్



అధికారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



సమావేశానికి హాజరైన అధికారులు

పుత్తూరు: వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరాకు అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, పారిశుధ్యంపై కూడా అశ్రద్ధ వహించవద్దునని అధికారులను తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ హెచ్చరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో కలిసి పుత్తూరు, వడమాలపేట మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పుత్తూరు పట్టణంలో గ్రౌండ్ లెవల్ వాటర్‌పైనే ఆధారపడి 3 రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ చెప్పడంపై కలెక్టర్ స్పందించారు. రానున్న మేనెలలో బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందని, 3 రోజులకు ఒకసారి కాకుండా, కనీసం 2 రోజులకు ఒకసారి ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పబ్లిక్ అండ్ హెల్త్ ఈఈ సుబ్బారాయులు మాట్లాడుతూ రూ.139 కోట్లతో శ్రీకాళహస్తి తెలుగుగంగ కాలువ నుంచి పుత్తూరు ఎస్ఎస్ ట్యాంకు వరకు మొత్తం 53 కిలోమీటర్ల పైపులైను పనులు 35 కిలోమీటర్ల మేర పూర్తయ్యిందని, మిగిలిన 18 కిలోమీటర్లకు టెండర్లు పిలవాల్సి ఉందని తెలిపారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ఇందుకు సంబంధించి తగిన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పుత్తూరు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న 70 మంది పారిశుధ్య సిబ్బందిలో ప్రతిరోజూ 15 మంది వరకు సెలవులో ఉంటారని, ఇద్దరు నిరవధిక సెలవులో ఉన్నారన్న మున్సిపల్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ సర్టిఫికెట్ లేకుండా నిరవధిక సెలవులో ఉన్న వారిని తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య లోపంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని దీనిపై అశ్రద్ధ వహిస్తే ఉద్యోగాలు పోతాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ రానున్న వేసవి రెండు మూడు నెలలు ప్రతి అధికారి జాగ్రత్తగా పనిచేయాలని లేకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో పుత్తూరు, వడమాలపేట మండలాలకు చెందిన అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం పలువురు అర్జీదారులు కలెక్టర్‌కు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ప్రణాళిక తయారీపై శిక్షణ

పాలసముద్రం: వెలుగు కార్యాలయంలో గురువారం వార్షిక ప్రణాళిక, జీవనోపాధుల ప్రణాళికపై ఏపీఎం కల్పలతరెడ్డి ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘం సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్షిక ప్రణాళిక తయారీ, జీవనోపాధులపై వివరించారు. ప్రతి గ్రామంలో ఐదు నుంచి ఆరుగురు సభ్యులు ఎంపిక చేసుకొని వారికి సర్వే యాప్ తదితర విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. అందుకే వీఓఏలు, మహిళా సంఘాల లీడర్లు నాలుగు రోజులపాటు శిక్షణ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్రాలు మురగయ్య, శోభ, మంజుల, డ్వాక్రా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ

పాలసముద్రం: మండలంలోని ఆముదాల పంచాయతీలో గురువారం పశువుల దాహం తీర్చడానికి నిర్మిస్తున్న నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అయితే స్థానిక సర్పంచ్ లేకుండానే టీడీపీ నాయకులతో భూమిపూజ చేయించడం చర్చనీయాంశమైంది. ఉపాధిహామీ పథకంలో నోరులేని మూగజీవాలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నీటి తొట్టెలు నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే ఏపీఓ మార్గరెట్ టీడీపీ నాయకులతో కలసి సర్పంచ్ లేకుండానే నీటి తొట్టెలకు భూమి పూజలు చేయించడం విమర్శలకు తావిస్తోంది.